సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



కళ్లముందే కష్టమంతా బూడిద

సంతకవిటి మండలం సిరిపురంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎనిమిది పూరిళ్లు దగ్ధమయ్యాయి. - 8లో



విధుల్లో అలసత్వం వద్దు

కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో దేహదారుఢ్య ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ ఎస్వీ వకుల్ జిందల్ ఆదేశించారు. - 8లో

విశాఖ-పార్వతీపురం మధ్య ప్రత్యేక రైలు

పార్వతీపురంటౌన్: సంక్రాంతి పండగకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు వీలుగా విశాఖ నుంచి పార్వతీపురానికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె. సందీప్ శుక్రవారం తెలిపారు. 08565/66 నంబర్ కలిగిన రైలు జనవరి 10 నుంచి 20 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. విశాఖలో ఉదయం 10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.20 గంటలకు పార్వతీపురం చేరుతుందన్నారు. తిరిగి పార్వతీపురం నుంచి 12.45 బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విశాఖ చేరుతుందని తెలిపారు.

న్యూస్‌రీల్

ఇసుక టెండర్లు ప్రారంభం



టెండర్ బాక్సులకు వేస్తున్న సీళ్లను పరిశీలిస్తున్న జేసీ శోభిక

పార్వతీపురం: జిల్లాలోని భామిని మండలం నేరడి, పసుకుడి, పాలకొండ మండలం చిన మంగళాపురం ఇసుక రీచ్‌లకు టెండర్లు ప్రారంభమయ్యాయి. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక సమక్షంలో శనివారం కలెక్టరేట్‌లో టెండర్ బాక్సులకు సీల్ వేయించారు. టెండర్లు వేసేందుకు 2025 జనవరి 3వ తేదీ ఆఖరని, ఆసక్తి గల టెండర్‌దారులు రూ.10వేల డీడీని తీసి కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్‌లో వేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా గనులు, భూగర్భ శాస్త్ర అధికారి జి.శ్రీనివాస్, సిబ్బంది, పాల్గొన్నారు.

పసుకుడిలో ఏనుగులు



పసుకుడి వంశధార నదీ తీరంలో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని పసుకుడి గ్రామానికి ఏనుగుల గుంపు శనివారం చేరుకంది. రెండు రోజుల కిందట భామినిలోని వరిచేలను ధ్వంసం చేసిన ఏనుగులు.. వంశధార నది ఆవల ఉన్న ఒడిశా గ్రామాలకు నిన్న వెళ్లాయి. మళ్లీ నదిని దాటి పసుకుడి గ్రామానికి చేరుకోవడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

ప్రిన్సిపాల్ ప్రవర్తనపై విచారణ



పాఠశాలలో విచారణ జరుపుతున్న డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి, ఎంపీడీఓ బి.వెంకటరమణ, వీరఘట్టం ఎంఈఓలు

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గురుబ్రహ్మ పాఠశాల ప్రిన్సిపాల్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి, వీరఘట్టం ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. 4, 5, 6వ తరగతి బాలబాలికలతో విడివిడిగా మాట్లాడారు. వారిచ్చిన వివరాలను రికార్డు చేశారు. నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పిస్తామని డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి తెలిపారు. వీరితో పాటు ఎంపీడీఓ బి.వెంకటరమణ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులు, అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడారు.

పవన్ పర్యటనలో నకిలీ ఐపీఎస్

చిత్రంలో పోలీస్ సిబ్బందితో ఐపీఎస్ డ్రెస్‌లో ఫొటో దిగిన వ్యక్తి నిజమైన పోలీస్ అధికారి అనుకుంటే పొరపాటే. ఆయన నకిలీ పోలీస్ అధికారి. సాక్షాత్తు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 20న సాలూరు నియోజకవర్గం మక్కువ మండలంలో చేపట్టిన పర్యటనలో పోలీస్ అధికారి వేషధారణలో హల్‌చల్ చేశారు. బందోబస్తుకు హాజరైన పోలీసులు, పోలీస్ అధికారులతో ఫొటోలు దిగారు. వాటిని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి తన ఊరివారిని నమ్మించి భూ సమస్యను పరిష్కరించుకోవాలని చూశారు. చివరకు పోలీసులకు చిక్కారు. అయితే, 'వై' కేటగిరీ భద్రత ఉన్న ఒక ఉప ముఖ్యమంత్రి.. మరో రాష్ట్ర మంత్రి.. ఎమ్మెల్యేలు.. ఇంతమంది ఉన్న చోట ఒక అగంతకుడు... అందులోనూ పోలీసు ఉన్నతాధికారి వేషం వేసి, దర్జాగా కలియతిరగడం.. జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్.. సాక్షాత్తు పోలీస్ బాస్, ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు.. పవన్ పర్యటన ముగిసే వరకూ అక్కడే ఉండడం.. ఆయనపై ఏ ఒక్కరికీ అనుమానం రాకపోవడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటన పోలీస్ భద్రతాలోపాలను ఎత్తిచూపింది.

- సాక్షి, పార్వతీపురం మన్యం





అ'పూర్వ'కలయిక

విజయనగరం కోరుకొండ సైనిక పాఠశాలలో 1999-2006 మధ్యన విద్యనభ్యసించిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. చిన్ననాటి మిత్రులను చూసి మురిసిపోయారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబ నేపథ్యాలు, ఉద్యోగాలు, కష్టసుఖాలు తెలుసుకుంటూ రోజంతా పాఠశాలలో సందడిగా గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలలో కలియతిరిగారు. వివిధ వేదికలు, ఆడిటోరియంలను పరిశీలించారు. పాఠశాలలో చదవడం ఓ వరమని పేర్కొన్నారు. ఇక్కడ విద్యార్థుల క్రమశిక్షణకు దేశంలోనే మంచి పేరుందన్నారు. స్టేడియంలో జరిగిన ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థుల ఇష్టాగోష్టితో సమ్మేళనాన్ని ఆనందంగా ముగించారు.

- విజయనగరం రూరల్

రోడ్డు నిబంధనలు.. కఠినతరం

- నిబంధనలు అతిక్రమిస్తే భారీమూల్యం తప్పదు
- నూతన సంవత్సరం నుంచి నిఘా మరింత కఠినతరం
- లైసెన్స్ లేకుంటే రూ.5000, హెల్మెట్ లేకుంటే రూ.1000 ఫైన్
- తనిఖీలను ముమ్మరం చేసిన పోలీసులు



ఏజెన్సీలో వాహనాల ఫిట్‌నెస్ పత్రాలు పరిశీలిస్తున్న ఎంవీఐ అధికారులు

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మరణాల శాతం తగ్గించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. న్యాయస్థానాల ఆదేశాలు తూచా తప్పకుండా అమలుచేసేందుకు నడుంబిగించారు. తనిఖీలను ముమ్మరం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో వాహనాల సంఖ్య ఇలా...

జిల్లాలో 15 మండలాల పరిధిలో దాదాపుగా 34,903 ద్విచక్ర వాహనాలు, 3,983కార్లు, వివిధ వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్లు 750, రవాణా సంబంధిత ప్రైవేటు బస్సులు 176, అంబులెన్స్‌లు 12, క్యాబ్‌లు 42, సరుకు రవాణా వాహనాలు 2,645, మోటారు క్యాబ్‌లు 597, పాఠశాల బస్సులు 88, మూడు చక్రాల, ఇతర వాహనాలు మరో 4వేల పైచిలుకు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.



పాలకొండలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అపరాధ రుసుము వసూలు ఇలా..

- లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే గతంలో రూ.500 జరిమానా విధించే వారు. ఇప్పుడు రూ.5000కు పెంచనున్నారు.
- రెడ్‌లైట్‌ను ఉల్లంఘించి వాహనాలను నడిపితే రూ.500 ఫైన్
- మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపితే రూ.1000 వసూలు చేస్తారు.
- తప్పుడు మార్గం (రాంగ్ రూట్)లో వాహనాన్ని నడిపితే రూ.5వేలు ఫైన్.
- డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం తాగి వాహనం నడిపితే) గతంలో రూ.2 వేలుగా ఉన్న ఫైన్‌ను ఇప్పుడు ఏకంగా రూ.10 వేలకు పెంచారు.
- బైక్ లేదా వాహనాల రేసింగ్, స్పీడ్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు వసూలు చేయనున్నారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కార్లు నడిపితే రూ.వెయ్యి కట్టాల్సిందే. దీనికి తోడు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు.
- అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే రూ.10 వేల పైన ఫైన్ విధిస్తారు.
- ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే రూ.2 వేల వరకు చెల్లించాలి.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.2 వేలు కట్టాల్సిందే. రూ.25 వేలు జరిమానా తప్పదు.
- కొత్త చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే రూ.25 వేలు జరిమానా విధిస్తారు. ప్రమాద తీవ్రతను అనుసరించి వాహన యజమానికి మూడేళ్ల వరకూ జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మన శ్రేయస్సు కోసమే...



నిబంధనలు వాహన చోదకుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిర్దేశించినవి. చిన్న చిన్న పొరపాట్లు కారణంగా రోడ్డు ప్రమాదాల్లో అవయువాలు, ప్రాణాలు కోల్పోతున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ క్రమంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తాం. అధికారులకు వాహన చోదకులు, ప్రజలు సహకరించాలి.

– టి.వేణుగోపాలరావు, ఎంవీఐ, పాలకొండ

నిబంధనలు పాటించాలి



జనవరి 1వ తేదీ నుంచి ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తాం. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డు నిబంధనలు పాటించక పోవడం, అవగాహన లేని డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం, మైనర్లు వాహనాలు నడపడం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపులు, సర్కిళ్ల వద్ద నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతో నిండు ప్రాణాలు పోతున్నాయి. ఈ క్రమంలో మీ భద్రతకై అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వాహన చోదకులు, యజమానులు నిబంధలు అతిక్రమించవద్దు.

– టి.దుర్గాప్రసాద్ రెడ్డి, రవాణాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

నిరంతర తనిఖీలు



రహదారి ప్రమాదాలను అధిగమించేందుకు ఇక నుంచి సబ్ డివిజన్ పరిధిలో నిరంతర తనిఖీలు చేపడతాం. ముఖ్యంగా హెల్మెట్ల వాడకంపై నిబంధనలపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఈ కోవలో మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులకు, వాహన యజమానులకు కొన్ని సందర్భాల్లో శిక్ష తప్పదని గుర్తించాలి. ఇతరులకు వాహనాలు ఇచ్చే సమయంలో వాహన యజమానులు ఆలోచించుకోవాలి. అపరాధ రుసుములు చెల్లించేకంటే అవగాహనతో మెలగడం మంచిది.

– ఎం.రాంబాబు, డీఎస్పీ, పాలకొండ

నీతి అయోగ్ ర్యాంకింగుల్లో భామినికి ప్రథమ స్థానం

- దక్షిణ భారత దేశంలో అగ్రస్థానం
- రూ.1.50 కోట్ల ప్రోత్సాహకం

సాక్షి, పార్వతీపురం మన్యం: నీతి అయోగ్ డెల్టా ర్యాంకింగ్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా భామిని ఆశావహ (యాస్పిరేషనల్) బ్లాక్.. దక్షిణ భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణ భారతదేశంలోని (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక) రాష్ట్రాల్లోని దాదాపు వంద బ్లాకులలో భామిని అగ్రస్థానంలో నిలవడం విశేషం. నీతి ఆయోగ్ ప్రతి త్రైమాసికంలో సూచికల సాధనను విశ్లేషిస్తుంది. అత్యుత్తమ ఫలితాలు సాధించిన బ్లాకులను ప్రకటిస్తుంది. ఈ త్రైమాసికంలో భామిని యాస్పిరేషనల్ బ్లాక్ ర్యాంకింగ్‌లో అగ్రస్థానం దక్కించుకోవడంతో ప్రోత్సాహకంగా రూ.1.50 కోట్లు పొందనుంది.

ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారంటే...

విద్య, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, జీవనోపాధి అభివృద్ధి, మౌలిక సదుపాయాల విభాగాల్లో నీతి అయోగ్ సూచికలను విడుదల చేస్తుంది. పదో తరగతి పరీక్షలో 93 శాతం ఉత్తీర్ణత సాధించడం, వంద శాతం భూ ఆరోగ్య కార్డుల పంపిణీ, 20 గ్రామ పంచాయతీలను టీబీ ముక్త్ భారత్లో భాగంగా టీబీ రహితంగా ప్రకటించడం.. బత్తిలి, బాలేరు, భామిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణులను వంద శాతం గుర్తించడం – నమోదు చేయడం , సహజ వ్యవసాయంలో ప్రోత్సాహం, పంట మార్పిడి, వందశాతం రాయితీపై చిరుధాన్యాల విత్తనాల పంపిణీ, మొక్కజొన్న విస్తీర్ణం 9 ఎకరాల నుంచి 250 ఎకరాలకు పెంచడం వంటి అంశాలలో భామిని మంచి ప్రగతి కనబరిచిందని జిల్లా అధికారులు తెలిపారు.

గత ఏడాది కూడా జిల్లాకు ప్రోత్సాహకం

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యాస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమం 2023 మార్చి నెలలో ప్రారంభమైంది. ఉమ్మడి విజయనగరం నుంచి విడిపోయిన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాను 'యాస్పిరేషనల్ జిల్లా' గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాల వల్ల నీతిఅయోగ్ సూచికలలో 2023 సంవత్సరంలో కూడా జిల్లా అగ్రస్థానంలో నిలిచి రూ.3.50 కోట్ల ప్రోత్సాహకాన్ని పొందింది. ఈసారి భామినికి ఆ ఘనత దక్కింది.

అధికారులను అభినందించిన కలెక్టర్

ఈ ఘనత సాధించిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ శ్యామ్ప్రసాద్ అభినందించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూచీలను అనుసరించి ప్రోత్సాహక నిధులకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇదే స్ఫూర్తితో బ్లాకు అభివృద్ధిలో ర్యాంకును కొనసాగించేందుకు కృషి చేయాలని కోరారు. రక్తహీనత నియంత్రణను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు.

ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రగతిలో ఉన్న జేజేఎం పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జేజేఎం పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లాలోని తోటపల్లి, వెంగళరాయసాగర్ ప్రాజెక్టుల నుంచి అదనంగా తాగునీటిని అందించేందుకు డీపీఆర్‌ను రూపొందించాలని, రానున్న 30 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ ఓ ప్రభాకరరావు, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్.అప్పలనాయుడు, భూగర్భ జలవనరుల శాఖ అధికారి ఎ.రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీఓలు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

కొండను కాపాడుకుందాం

- స్పష్టం చేసిన బడిదేవర కొండ పరిరక్షణ కమిటీ
- పోలీసుల బెదిరింపులు ఖాతరు చేయకుండా కోరి గ్రామంలో విస్తృత ప్రజాసమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: బడిదేవరకొండ ప్రజలందరిది.. అది గిరిజన ప్రజలకు జీవనాధారం.. ప్రాణాలు అరిఎంచైనా గ్రానైట్ తవ్వకాలను అడ్డుకుని కొండను కాపాడుకుందామని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ నాయకుడు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. కొండ గ్రానైట్ లైసెన్స్ రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ కోరి గ్రామం వద్ద కమిటీ ఆధ్వర్యంలో శనివారం విస్తృత ప్రజాసమావేశం నిర్వహించారు. మొదటగా తానవలస గ్రామం నుంచి కోరి గ్రామం వరకు గిరిజనులు పాదయాత్ర చేపట్టారు. దీనికి పోలీసులు అభ్యంతరం తెలపడంతో కమిటీ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఎక్కడివారు అక్కడే బైఠాయించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవరకొండ తవ్వకాలలో ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ఎటువంటి ప్రజాభిప్రాయసేకరణ లేకుండా క్వారీ పనులు చేపడుతున్నారని, దీనిని వ్యతిరేకించాలన్నారు. బడిదేవరమ్మ గుండె కోసేస్తుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ, ఫారెస్ట్ ఉమ్మడి సర్వేలో అది రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోనే ఉందని హైలెవల్ కమిటీ నిర్ధారించిందని, ప్రభుత్వం గ్రానైట్ తవ్వకాల లైసెన్స్ సైతం రద్దుచేసిందని, ఇప్పుడు అది గయ్యాలి కొండగా తప్పుడు రాతలు చేసి గిరిజనులను మోసం చేయడం తగదన్నారు. కొండ తవ్వకాలపై అటవీశాఖ కోర్టును ఆశ్రయించకపోవడం విచారకరమన్నారు. ప్రజల జీవన సంపదలను తాకట్టుపెట్టేలా టీడీపీ కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లైసెన్సులను జారీ చేయడాన్ని తప్పుబట్టారు. తవ్వకాలకు అనుమతులు జారీ చేసిన వెంకటరెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు ప్రణాళికను త్వరలో కమిటీ ప్రకటిస్తుందని చెప్పారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనునాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఐద్వా రాష్ట్ర నాయకులు పి.సంగం , సీపీఐ నాయకులు జీవ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బంటు దాసు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాలమిట్ట రాము, తొక్కుడువలస, తానవలస, సంగంవలస, కోరి, గంగాపురం, రావికోన, ఎమ్మార్‌నగరం గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారులపై కూటమి నేతల కన్నెర్ర..!

విజయనగరం జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) పీడీగా బాధ్యతలు చేపట్టిన ఇ.సందీప్ పట్టుమని 10 రోజులు కాకముందే సెలవు పెట్టేశారు. ఉపాధిహామీ పథకం మెటీరియల్ పనులు అధికార పార్టీ నేతలు చెప్పిన వారికి అనుకూలంగా తీర్మానాలు చేయించలేకపోయారని సెలవు పెట్టేలా కూటమి నేతలు అతనిపై తీవ్ర ఒత్తిడి తేవడమే కారణమన్నది ప్రధాన ఆరోపణ. ఇప్పటి వరకు ఆయన విధుల్లో చేరలేదు. రెండు రోజుల కిందట ఎస్.కోట ఏపీడీ శారదా దేవికి ఆ బాధ్యతలు అప్పగించారు.

డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు కూడా నెల రోజులు పాటు సెలవు పెట్టి, ఇటీవల విధుల్లో చేరారు. ఉద్యోగ నియామకాలు సంబంధించి అధికార పార్టీ నేతలు చెప్పినట్టు చేయలేదని సెలవుపెట్టేలా అతనిపై కూటమి నేతలు ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. తాజాగా ఆయనకు పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయింది. ఈ బదిలీ వెనుక కూడా కూటమి నేతల మంత్రాంగం పనిచేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



- మాట వినని వారిపై సెలవు పెట్టాలని హుకుం
- గత్యంతరం లేక సెలవు పెట్టేస్తున్న అధికారులు
- గతంలో డ్వామా పీడీ, డీఎంహెచ్ఓ సెలవుపెట్టిన వైనం
- తాజాగా సెలవులో ఐసీడీఎస్ పీడీ

విజయనగరం ఫోర్ట్:

తాజాగా విజయనగరం ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి కూడా సెలవుపెట్టేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆమె సెలవు పెట్టారు. 26వ తేదీన ఆమె విధుల్లో చేరాల్సి ఉంది. ఆరురోజుల సెలవుకే పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి అప్పగించడం చర్చనీయాంశమైంది. పీడీ పెట్టిన ఆరు రోజుల సెలవులో 24, 25 సెలువు దినాలు. కూటమి నేతల ఒత్తిడితో ఇటీవల గజపతినగరం మండలం రామన్నపేట అంగన్‌వాడీ ఆయా మానాపురం సౌజన్యను తొలగించారు. ఆమె తరపున అంగన్‌వాడీ సంఘ నాయకులు, కార్యకర్తలు, ఆయాలతో పాటు, గ్రామస్తులు కలిసి కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ సౌజన్యను విధుల్లోకి తీసుకోలేదు. ఆమె హైకోర్టును ఆశ్రయించారు. పీడీ వ్యవహార శైలి వల్లే రామన్నపేట ఆయా విషయం కోర్టు వరకు వెళ్లిందని ఆగ్రహించిన కూటమికి చెందిన ప్రజాప్రతినిధి ఒకరు పీడీ సెలవు పెట్టేలా ఒత్తిడి తెచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, పీడీ శాంతకుమారి ఈ నెల 29వ తేదీ వరకు సెలవు పొడిగించుకున్నారు. అనంతరం ఆమె విధుల్లో చేరుతారా? లేదంటే సెలవు పొడిగించుకుంటారా? అన్న చర్చ ఐసీడీఎస్‌లో సాగుతోంది. కూటమి నేతలు ఆమె పట్ల కరుణ చూపుతారా లేదంటే దీర్ఘకాలిక సెలవు పెట్టేవిధంగా ఒత్తిడి తెస్తారా అనేది వేచి చూడాలి.

చర్చనీయాంశంగా మారిన వేధింపులు

గత కొద్దిరోజులుగా విజయనగరం జిల్లాలో అధికారులపై కూటమినేతల వేధింపులు ఉద్యోగ వర్గాలను కలవరపెడుతున్నాయి. ఏదో మేలు చేస్తారని ఏరి కోరి కూటమి నేతలను ఎన్నుకున్నందుకు తగిన ఫలితం అనుభవించాల్సి వస్తోందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఓ అధికారి అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇటువంటి ఒత్తిడి ఏ రోజూలేదని, ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకునేవారమని అందరి ముందు చెప్పడం గమనార్హం. కూటమి నేతల ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నామని ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. అధికారులైతే జిల్లాలో పనిచేయడానికి హడలిపోతున్నారు.

క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో పరీక్ష నిర్వాహకులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను స్థానిక పూల్‌బాగ్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో శనివారం ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించే పరీక్షలు నిర్వహించారు. కవాతు ప్రదర్శనను పరీక్షించారు. అనంతరం ఉత్తమ కవాతు ప్రదర్శన, సామర్థ్యాలను చూపిన నలుగురు విద్యార్థులను ఎంపిక చేసారు. ఎంపిక పరీక్షల నిర్వహణ బాధ్యతను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం కార్యదర్శి వాక చిన్నంనాయుడు తీసుకున్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎస్.కనకలక్ష్మి, డీఓసీ ప్రవీణ్‌కుమార్, డీటీసీ సూరిబాబు, ఏఎస్‌ఓసీ దుర్గా నాగేశ్వరరావు, గౌరవ వైస్ ప్రెసిడెంట్లు సీహెచ్ నారాయణమూర్తి, వి.త్రినాధ్‌నాయుడు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆవుల కళేబరాలు



లేఅవుట్ గోడ సమీపంలో పడి ఉన్న ఆవుల కళేబరాలు

కొత్తవలస : మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలో కొత్తవలస – విజయనగరం రోడ్డును ఆనుకొని వున్న శ్రీకృష్ణనగర్ లేఅవుట్ ప్రహరి పక్కన అనుమానాస్పద స్థితిలో రెండు ఆవుల కళేబరాలను శనివారం స్థానికులు గుర్తించారు. ఈ ఆవులు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులవి కావని స్థానికులు చెబుతున్నారు. కాగా గత కొద్ది నెలలుగా కొత్తవలస మండలం కేంద్ర బిందువుగా పశువుల అక్రమ రవాణ, మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే సమయంలో ఈ ఆవులు మృతి చెంది వుంటాయని, దీంతో ఇక్కడికి తెచ్చి పడేసారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆవుల మృతదేహాలకు సంబంధించి పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తే అసల విషయాలు బయటపడతాయని స్థానికులు పేర్కొంటున్నారు.


వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకుని మృతి చెందిన అప్పల నాయుడు

విజయనగరం క్రైమ్: మండలంలోని ధర్మపురిలో గల కెల్లవీధిలో తీవ్ర మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ధర్మపురి గ్రామానికి చెందిన చెల్లూరి అప్పలనాయుడు (41) విజయనగరం పీడబ్ల్యూ మార్కెట్‌లో కళాసీగా పని చేస్తున్నాడు. మద్యం అలవాటు ఉన్న నాయుడు తరచూ భార్యాపిల్లలతో తగాదా పడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో భార్య తన పిల్లలను తీసుకుని అయ్యన్నపేటలోని పుట్టింటికి వెళ్లిపోవడం, పెద్దమనుషులు కలుగజేసుకుని ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చడం తరచుగా జరుగుతూ ఉండేది. ఈ నెల 25న మద్యం సేవించి అప్పలనాయుడు భార్యతో తగాదా పడ్డాడు. దీంతో ఆమె పిల్లలతో పాటూ పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన అప్పలనాయుడు శుక్రవారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరేసుకున్నాడని తెలిపారు. శనివారం ఉదయం అప్పలనాయుడు సోదరుడు నారాయణరావు ఇంటికి వెళ్లి తలుపులు తీసి చూడగా అప్పలనాయుడు ఫ్యాన్‌కి ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడని తెలిపారు. దీంతో సోదరుడు నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్ మధ్యలో మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద రీతిలో రైల్వే ట్రాక్ మధ్యలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని జీఆర్‌పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు శనివారం తెలిపారు. సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు, 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు కలిగిన మగ వ్యక్తి మృతదేహం విజయనగరం, కోరుకొండ రైల్వే స్టేషన్‌ల మధ్య జొన్నవలస రైల్వేగేట్ దగ్గరలో రైల్వే ట్రాక్ మధ్యలో పడి ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 17089 నంబరునుగాని, జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లోగాని సంప్రదించాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹224

కళ్లముందే.. కష్టమంతా బూడిద

- అగ్ని ప్రమాదంలో ఎనిమిది పూరిల్లు దగ్ధం
- ప్రమాదంలో పేలిన ఐదు గ్యాస్ సిలిండర్లు
- ఉవ్వెత్తున ఎగసిపడిన అగ్నికీలలు
- కాలిపోయిన తిండి గింజలు, రూ. పది లక్షల నగదు




సిరిపురంలో ఎగిసిపడుతున్న అగ్నికీలలు



నేలమట్టమైన పూరిల్లు

సంతకవిటి: వారందరివీ నిరుపేద కుటుంబాలు. కూలి పనులు చేసుకుని అప్పుడే ఇళ్లకు చేరుకున్నారు. ఇంటి పనుల్లో మహిళలు నిమగ్నమయ్యారు. అంతే.. ఒక్కసారిగా అగ్నికీలలు ఎగసిపడడంతో భయాందోళనతో ఇళ్ల నుంచి పరుగుతీశారు. ఐదు గ్యాస్ సిలిండర్లు పేలిపోవడంతో వణికిపోయారు. కష్టమంతా క్షణాల్లో కళ్లముందరే కాలిపోతున్నా ఏమీ చేయలేక కన్నీరుకార్చారు. సంతకవిటి మండలం సిరుపురం పొందరవీధిలో శనివారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎనిమిది పూరిళ్లు దగ్ధమయ్యాయి. పొందూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో పొందరవీధికి చెందిన మంతిరెడ్డి ముద్దమ్మ, అధికార్ల అప్పారావు, మంతిరెడ్డి చిన్ననర్సింహులు, రాజాపు చిన్నారావు, మంతిరెడ్డి గౌరమ్మ, మంతిరెడ్డి కన్నడు, రామాదాసు పార్వతి, లంక అచ్చెయ్యమ్మ, లంక లక్ష్మీదేవి తదితరులకు చెందిన పూరిల్లు దగ్ధమయ్యాయి. బాధితులందరూ కట్టుబట్టలతో మిగిలిపోయారు. ఇంట్లో దాచిపెట్టుకున్న నగదు, బంగారు వస్తువులు, తిండి గింజలతో సైతం అగ్నికి ఆహుతయ్యాయి. మంతిరెడ్డి ముద్దమ్మ కుమార్తె వివాహం కోసం దాచిపెట్టిన రూ.10లక్షలు నగదు కాలిపోవడంతో కన్నీరుమున్నీరవుతోంది. సమాచారం అందుకున్న సంతకవిటి తహసీల్దార్ సత్యం సంఘటనపై ఆరా తీశారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఆస్తినష్టం అంచనా వేస్తున్నారు. ప్రమాద కారణాలు తెలియరాలేదు.

ఇది తాగునీరే.. నమ్మండి..



గోవుపేటలో కుళాయిలు ద్వారా వచ్చిన నలుపు రంగు నీరు

చిత్రంలో కనిపిస్తున్నది తాగునీరు. గుర్ల మండలం గూడెం పంచాయతీ పరిధిలోని గోవుపేట వాసులకు శనివారం సరఫరా చేసిన తాగునీరు ఇది. బురదనీరు సరఫరా కావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. ఇప్పటికే డయేరియాతో పలు గ్రామాల ప్రజలు అల్లాడుతుంటే.. స్వచ్ఛమైన నీరు సరఫరా చేయకపోవడంపై మండిపడ్డారు. బురదనీరు సరఫరా విషయాన్ని గ్రామీణ నీటి సరఫరా ఏఈ కిషోర్ వద్ద ప్రస్తావించగా వాటర్ ట్యాంక్‌ను ప్రతిరోజు శుభ్ర పరిచి క్లోరినేషన్ చేస్తున్నామని, బురదనీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. – గుర్ల

నిబంధనలు పాటించకపోతే లైసెన్స్‌పై వేటు

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్



డి.మణికుమార్

విజయనగరం క్రైమ్: వాహనాలు నడిపే వారు నిబంధనలు పాటించకపోతే లైసెన్స్‌పై వేటు వేస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డి.మణికుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతకే ప్రాధాన్యత కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ఆటో, క్యాబ్, టాక్సీల్లో అధికంగా ప్రయాణికులను ఎక్కించి ఓవర్ లోడ్ చేస్తే అటువంటి వాటిని గుర్తించి వారి డ్రైవింగ్ లైసెన్స్‌పై సస్పెన్షన్ వేటు వేస్తామన్నారు. మూడు నెలల పాటూ డ్రైవింగ్ చేయడానికి అనర్హుడిగా గుర్తిస్తామన్నారు. నిబంధనలు బేఖాతరు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇప్పటివరకు 100 వాహనాలపై వేటు వేసామన్నారు. పొల్యూషన్ చెకింగ్‌లు కూడా ఇప్పటివరకూ 25వేలకి పైగా వాహనాలకు చెక్ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారిపై అక్టోబరులో 444 కేసులు, నవంబరులో 1184 కేసులు డిసెంబరులో ఇప్పటివరకూ 919 కేసులు నమోదు చేశామ్నారు. జిల్లాలో ప్రమాదాలు సంభవించే రహదారి ప్రాంతాల్లో 40 వరకూ బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించామని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రాథమిక చర్యలు చేపట్టామన్నారు. నిబంధనలకు అనుగుణంగా వెళ్లండి.. క్షేమంగా ఇంటికి చేరండనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

- పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందల్ సూచన



పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టాల్సిన విధులపై సూచనలు చేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో చేపడుతున్న స్టైఫండరీ సివిల్ పోలీసు కానిస్టేబుల్ (పురుషులు/మహిళలు), ఏపీఎస్‌పీ పురుషులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియలో పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది నిర్వహించాల్సిన విధులపై ఎస్పీ వకుల్ జిందల్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అవగాహన కల్పించారు. నియామక ప్రక్రియలో విధులు నిర్వహించేందుకు ఎంపిక చేసిన పోలీసు అధికారులు, మినిస్టీరియల్ అధికారులు, సిబ్బందితో మమేకమై వారు నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ప్రక్రియ చాలా సున్నితమైనదని, ప్రతీ ఒక్కరూ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వద్దన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియామకాలు పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగానూ, సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు సర్టిఫికేషన్ పరిశీలన క్షుణ్ణంగా జరపాలని, ధ్రువపత్రాల పరిశీలనలో ఏమైనా సందేహాలుంటే సంబంధిత అధికారులు లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియామకాల ప్రక్రియ ప్రతీ రోజూ ఉదయం 4 గంటలకు ప్రారంభమవుతుందని, అభ్యర్థుల హాల్‌టికెట్స్‌తో పాటూ, తమ పుట్టిన తేదీ, విద్యార్హతలు, రిజర్వేషన్‌లను ధ్రువపర్చే అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వీటితో పాటూ గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేసిన ఒక సెట్ జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. ఏదైనా కారణంతో అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకుని రావడంలో విఫలమైతే, వారికి రిక్రూట్‌మెంట్ జరిగే మరో రోజున అవకాశమివ్వడం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసు కానిస్టేబుల్ నియామకాల ప్రక్రియకు కేటాయించబడిన పోలీసు అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్‌కి గుర్తింపు కార్డులను ఇస్తారని, వారు మాత్రమే పరేడ్ గ్రౌండ్‌లో విధి నిర్వహణ నిమిత్తం ఉండాలన్నారు. అభ్యర్థులు మినహా, ఇతరులెవ్వరికీ ప్రవేశం లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు చేపట్టిన ఏర్పాట్లను ఎస్పీ ఇతర పోలీసు అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నియామక ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, వైద్య, పారా మెడికల్ సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. పోలీసు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పే దళారీల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, ఎం.వీరకుమార్, ఎస్.బాపూజీ, టిఎన్.శ్రీనివాసరావు, కె.థామస్‌రెడ్డి, ఏఓ పి.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరు మారరంతే...!





రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. అధికారులు సైతం నిత్యం హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ప్రజల్లో మార్పు రాకపోవడం బాధాకరం. పట్టణంలో పలుచోట్ల రైల్వే ట్రాక్‌ల పైనుంచి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలున్నా వినియోగించకుండా... ప్రమాదకరంగా పట్టాలను దాటుకుంటూ వెళ్తూ.. ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి, పట్టాల మీదుగా రాకపోకలు మానుకోవాలని పలువురు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్,విజయనగరం

ముగిసిన 'అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్క్‌షాప్'



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ (కంప్యూటర్ సైన్స్) విభాగం ఆధ్వర్యంలో 'అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్' పేరుతో వారం రోజులుగా నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. అమెజాన్ నిపుణుల నేతృత్వంలో ప్రాక్టికల్ సెషన్లతో క్లౌడ్ స్టోరేజ్, కంప్యూటింగ్ మరియు డేటాబేస్ మేనేజ్‌మెంట్‌తో సహా అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అవగాహన కలిగించాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. కొత్త టెక్నాలజీలను నేర్చుకోవాలనే ఉత్సాహం టెక్ ప్రపంచంలో మీకు అనేక తలుపులు తెరుస్తాయనడంలో సందేహం లేదని అన్నారు. వర్క్‌షాప్‌లో నేర్చుకున్న శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.రామమూర్తి, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొరికిన దొంగలు



మాట్లాడుతున్న సీఐ రమణ (పక్కనే ముసుగులో నిందితుడు)

గజపతినగరం : మండలంలోని మధుపాడ గ్రామంలో ఈ నెల 26న తెన్నేటి నరసింహమూర్తి ఇంటితో పాటు అంజనేయ స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి ఎవి.రమణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చోరీకి పాల్పడిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన తూముల దాలయ్యగా గుర్తించామన్నారు. ఆయనతో పాటు చోరీలో మరో ఇద్దరు మైనర్ వ్యక్తులు కూడా ఉన్నారని వారిని శనివారం మధుపాడ పాలదారి చెరువు వద్ద చోరీ చేసిన వాటిని పంపకాలు చేసుకుంటుండగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ లక్ష్మణరావుతో పాటు మరో నలుగురు సిబ్బంది వెళ్లి వారిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి మూడు కిలోల వెండి, రెండు కిలోల ఇత్తడి, ఒక టీవీ, సుమారు 10వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఎఐ కె.లక్ష్మణరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోగొట్టుకొన్న బంగారం అప్పగింత



బాధితురాలు ఇందిరకు బంగారు వస్తువులు అప్పగిస్తున్న సీఐ శంకరరావు, ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లి: పోగొట్టుకున్న బంగారాన్ని సీసీ కెమెరాలు ద్వారా నిఘా పెట్టి పట్టుకుని తిరిగి బాధితులకు అప్పగించినట్లు ఎస్‌ఐ ఎల్.దామోదరరావు చెప్పారు. ఈ మేరకు శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండున్నర తులాల బంగారు ఆభరణాలను బాధితురాలు గుడ్ల ఇందిరకు సీఐ శంకరరావు చేతులు మీదుగా అందజేసారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ మాట్లాడుతూ వారం రోజులు క్రితం పట్టణానికి చెందిన గుడ్ల ఇందిర తన కుటుంబ సభ్యులతో కలిసి శివరాం రోడ్‌లో వెళ్తుండగా ఆమె బ్యాగులో ఉన్న మండ గొలుసు, చేతి రింగు జారి పడిపోయాయి. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దీంతో సీసీ కెమెరాలు ద్వారా పరిశీలించగా బంగారు వస్తువులు తీసుకున్న గుర్ల మండలంలోని పెదబంటుపల్లి గ్రామానికి చెందిన మజ్జి గోవింద్ అనే వ్యక్తిని గుర్తించి విచారించారు. దీంతో ఆయన వస్తువులు తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు బాధితురాలు గుడ్ల ఇందిరకు ఆ బంగారు వస్తువులను అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ దామోదరరావు, కానిస్టేబుల్ రమణను సీఐ శంకరరావు అభినందించారు.

మద్యం పార్టీలకు అనుమతి తప్పనిసరి

- ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు

విజయనగరం క్రైమ్: విజయనగరం, మన్యం జిల్లాల్లో ప్రజలు, వ్యాపారులు నూతన సంవత్సరం, సంక్రాంతి నేపథ్యంలో లిక్కర్ పార్టీలు చేస్తే ప్రొహిబిషన ఎక్సైజ్ శాఖ ద్వారా ఈవెంట్ పర్మిషన్ తీసుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్మిషన్ కావాల్సిన వారు ముందుగా సంబంధిత ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించి, నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. పర్మిషన్ లేకుండా లిక్కర్ సరఫరా చేసినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా చట్ట రీత్యా నేరమని, అటువంటివారిపైనా, ఈవెంట్ యాజమాన్యాలపైనా క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారున. పర్మిషన్ కావాల్సిన వారు విజయనగరం జిల్లాకు సంబంధించి ఎక్సైజ్ అధికారి 86396 76401 నంబర్‌ను... మన్యం జిల్లా ఎక్సైజ్ అధికారి 94906 42242 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలి

- నైపుణ్య శిక్షణకు పెద్దపీట వేయాలి
- 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్
- ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష



మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పథకాల నిధులను సక్రమంగా వినియోగించకొని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగులు వేయాలని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలవాలని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శనివారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్వామా, పంచాయతీరాజ్ పనులు, అమృత సరోవర్, జలజీవన్ మిషన్, పీఎం జన్‌మన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, లక్‌పతి దీది, గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పీఎంఏవై, అమృత 2.0, సడక్ యోజన, నేషనల్ గోకుల్ మిషన్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, గిరిజన సంక్షేమం, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. వివిధ కార్యక్రమాల అమలు, తీసుకున్న చర్యలు, లక్ష్య సాధన, భవిష్యత్ కార్యక్రమాలను అంకెలతో పాటు తెలియజేశారు. ఉపాధి హామీ కాంపోనెంట్ నిధులను మార్చిలోపు శత శాతం వినియోగించుకొనేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఇళ్లకు పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. పథకాల ప్రగతిని ఆయా శాఖాధిపతులు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమల్లో భాగంగా మరింత ఎక్కువ మందికి వంద రోజుల పనిదినాలను కల్పించాలని, అలాగే సగటు వేతనాన్ని రూ.300కు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. వచ్చే ఏడాది నుంచే మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వినియోగాన్ని ప్రారంభించాలని సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని దాని అవసరాలకు తగ్గట్టుగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు సిద్ధం చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు, సంప్రదాయ ఇంధన వనరులను ఆదా చేసేందుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ఒక వరమని అన్నారు. దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయడం ద్వారా వీలైనంత ఎక్కువ మంది వినియోగించుకొనేలా చూడాలని కోరారు. సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు పి.అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్‌పర్సన్ కావలి గ్రీష్మ, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఆర్టీసీ ప్రాంతీయ చైర్మన్ దొన్ను దొర, ఎమ్మెల్సీ రఘురాజు, జిల్లా సీపీఓ పి.బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.